సమస్యల్లో మల్దకల్ సంత


రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మల్దకల్: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంత ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రజాదరణ పొందినా, సంతలో కనీస సౌకర్యాలు లేక అనేక ఇటు వ్యాపారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు అయిజ, గద్వాల, ఇటిక్యాల, గట్టు తదితర మండలాల నుంచి వందలాదిగా ప్రజలు ప్రతి శని వారం సంతలో క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. అంతేగాక గద్వాల జిల్లాలోనే ఎండు మిర్చికి ప్రసిద్ధిగాంచిన సంతకు జిల్లా నలుమూలల నుంచి కూడా ప్రజలు రావడం సర్వ సాధారణం. కానీ సంతను రోడ్లపై నిర్వహిస్తుండడంతో వ్యాపారులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

ట్రాఫిక్ జాంతో సమస్యలు

సంత నిర్వహిస్తున్న సమయంలో ట్రాఫిక్‌జాం అయి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎప్పుడు ఏ వాహనం దూసుకొస్తుందోనని వ్యాపారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరతున్నారు.

ముక్కుపిండి వసూలు

సంతలో ప్రతి వారం క్రమం తప్పకుండా తైబజార్ వసూళ్లు చేస్తున్నా వ్యాపారస్తులకు మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారస్తులు పేర్కొన్నారు. మంచినీటి సౌకర్యం, మరగుదొడ్లు, మూత్రశాలలు కూడా ఏర్పాటు చేయడం లేదంటున్నారు. కనీసం కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తుందంటున్నారు. దీంతో నిత్యావసర వస్తువులు కొనుగోలుకు వచ్చిన ప్రజలు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు లేవు



ప్రతి శనివారం నిత్యావసర వస్తువులను కొనేందుకు సంతకు వస్తాం. కానీ సంతలో తాగడానికి నీళ్లు కూడా దొరకవు. దూరప్రాంతం నుంచి వచ్చి హోటళ్లలో నీళ్లు తాగుదామంటే ఏమన్న విక్రయిస్తే గాని నీళ్లు ఇవ్వరు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

– సవారమ్మ, అమరవాయి

సంతకు వెళ్లాలంటే భయం



ప్రతి శనివారం జరిగే మల్దకల్ సంతకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఇరుకు రోడ్లపై సంత నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంది. రద్దీగా వాహనాలు తిరుగుతుండడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలి.

– సుస్మిత, మల్దకల్

తైబజార్ వసూలు చేస్తారు



క్రమం తప్పకుండా ప్రతి శనివారం సంతకు రాగానే తైబజార్ ముక్కుపిండి తీసుకుంటారు. కానీ సంతలో వ్యాపారస్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. తైబజార్‌పై ఉన్న ధ్యాస అధికారులకు సంతలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంపై లేదు.

– బుడ్డన్న, కుర్తిరావల్‌చెర్వు

క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

కేటీదొడ్డి: మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు నిబంధలపై అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత



అలంపూర్: ఉండవెల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ టెక్నాలజీతో కనుగొని 6 ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ హుస్సేన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ వెంకట్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ గఫార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



మానవపాడు: మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎ.బుద్దిపాడుకు టీంకు దాత సాయినాథ్‌రెడ్డి మొదటి బహుమతి రూ.20 వేలు, పెద్దఆముదాపాడు టీంకు దాత నాగరాజు రూ.10వేలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మండ్ల నాగరాజు క్రాంతి, ధీరజ్, బీలాం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో 11 కేవీ ఫీడర్‌కు సంబంధించిన విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్లకొమ్మలు తొలగించేందుకు శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 వరకు వెంకటాపురం, కురువపల్లి, యాపదిన్నె, ఉగడిదొడ్డి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహస్వామి ఆధ్వర్యంలో రాత్రి కుంకుమార్చన పూజలను వైభవంగా చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న సప్లిమెంటరీ పరీక్షలు



గట్టు: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సజావుగా నిర్వహించారు. ఇంగ్లిష్ పరీక్షకు 31 మంది విద్యార్థులకు గాను 30 మంది విద్యార్థులు, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాజు, డిపార్ట్‌మెంట్ అధికారి కృష్ణవర్ధన్‌లు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని డీఈసీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, పద్మావతి, సిట్టింగ్ స్క్వాడ్లు నల్లన్న, కాశీవిశ్వనాథ్‌లు తనిఖీ చేశారు.

శోభాయాత్రలో అలరించిన చిన్నారులు


శోభాయాత్రలో చిన్నారుల కోలాటం

అయిజ: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో నిర్వహించిన శోభాయాత్రలో చిన్నారులు ఆటపాటలతో అలరించారు. చిన్నారుల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. అంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి అయ్యప్ప స్వామి ఆలయం నుంచి భక్తులు శోభాయాత్ర ప్రారంభించారు. పాతబస్టాండ్, అంబేడ్కర్ చౌక్, గాంధీ చౌక్, సంతబజార్ మీదుగా శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వీరనారి అహల్యాబాయి



గద్వాల: హిందూ ధర్మం కోసం కృషి చేసిన వీరనారి అహల్యాబాయి అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. శుక్రవారం అహల్యాబాయి 300 జయంతిని పురస్కరించుకుని గద్వాల కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ.. మొఘలుల కాలంలో ధ్వంసమైన కాశీ, మధుర, అయోధ్య, పూరిజగన్నాథ్, కేదరానాథ్, ఉజ్జయిని, రామేశ్వరం, హరిద్వార్, త్రయంబకేశ్వర్ వంటి ప్రసిద్ధి చెందిన ఆలయాలను పునరుద్ధరించి సనాతన హిందూ ధర్మం కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రవికుమార్, రమాదేవి, దేవదాసు, బలిగెరశివారెడ్డి, రజక జయశ్రీ, నరేష్‌గౌడ్, రమేష్, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు


ప్రభుత్వాస్పత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: వైద్య అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన కలెక్టర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్లు, డిపార్ట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బయోమెట్రిక్‌తో పాటు మ్యానువల్ హాజరు రిజిస్టర్ ప్రతి నెల తన వద్దకు పంపించాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి, మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రతి నెల 400 ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే విధంగా చూడాలని సూచించారు. జిల్లాలో చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టీ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీఎస్‌ఎంఐ డీసీలను ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా మాతాశిశు వైద్య కేంద్రం వద్ద నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం వివిధ వార్డుల్లో సందర్శించి వైద్య సేవలపై రోగులను వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ రంగారావు, వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు



గద్వాల: బాలల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వారి సంరక్షణ బాధ్యత మనందరి బాధ్యతని చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ నవీన్ అన్నారు. శుక్రవారం మండలం బీరెల్లిలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంక్షేమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్ల లోపు బాల, బాలికలతో వెట్టిచాకిరీ చేయించడం నేరమన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై 1098కు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు

పాలన యంత్రాంగంలో వార్డు ఆఫీసర్లే కీలకం


మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలన యంత్రాంగంలో వార్డు ఆఫీసర్లే కీలకమని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పాలమూరుతో పాటు జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలలో పనిచేసే వార్డు ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయా డివిజన్లు, వార్డులలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పన్ను, నల్లా బిల్లులు సక్రమంగా వసూలయ్యేలా చూడాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేయాలని, ఆయా విభాగ అధికారులకు ఎప్పటికప్పుడు కావాల్సిన సమాచారం ఇవ్వాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈ సందీప్‌వరల్డ్, ఏసీపీలు కరుణాకర్‌గౌడ్, జ్యోత్స్నాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ధరూరు: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జూరాల డ్యాం జీరో పాయింట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనులు వేగవంతం


జెడ్పీ పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న వాటర్‌ట్యాంక్

అమరచింత: పట్టణంలో రూ.11 కోట్లతో చేపట్టిన అమృత్ 2.0 వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని దళమికట్టతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల నిర్మాణాలు బేస్ లెవల్ వరకు వచ్చినట్లు మెగా కంపెనీ మేనేజర్ నరాల శ్రీనివాసులు తెలిపారు. ఐదు లక్షల లీటర్లు, 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు వాటర్ ట్యాంకులతో పాటు పట్టణంలో 10 కిలోమీటర్ల మేరకు పైప్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పైప్‌లైన్‌తో పాటు కుళాయి కనెక్షన్లను రెండేళ్లలో పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తామన్నారు.

సీసీరోడ్డు పనుల పొడిగింపు

గట్టు: బస్టాండ్ ఆవరణలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణాన్ని ముందుకు పొడిగించారు. ప్రస్తుతం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. గతంలో రైతువేదిక నుంచి మసీదు వరకు మాత్రమే సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్, ఎస్సీ హాస్టల్, సబ్‌స్టేషన్ వరకు సీసీరోడ్డును పొడిగించి పనులు చేపట్టడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా సీసీరోడ్డు వేయడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల ఎత్తు తగ్గిపోవడంతో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి.

తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారు


ధాన్యం కాంటా పరిశీలిస్తున్న పల్లయ్య

అయిజ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో నిర్వాహకులు రైతులను దోచుకుంటున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని సింధనూరు గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. తరుగు పేరుతో అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని, ఈ విషయంపై పలు మార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిస్థితి మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాలుకు 2 కేజీలు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో గన్నీ బ్యాగులు అందించడం లేదని, వెంటనే కాంటా పట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కాంటా పట్టిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో అకాల వర్షాలకు వరిధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధన చేయాలి


అలంపూర్‌లో మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్, ఆర్పీలు


అలంపూర్ చౌరస్తాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న కోర్సు డైరెక్టర్, ఆర్పీలు

అలంపూర్: విద్యార్థులకు అర్థమయ్యే ఉపాధ్యాయులు బోధన చేయాలని కోర్సు డైరెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు శుక్రవారం నాల్గవ రోజు కొనసాగాయి. ఆర్పీలు పద్మనాభశాస్త్రి, శ్యాంసన్ ఇంగ్లిష్ సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరిసరాల విజ్ఞానంపై ఆర్పీలు శ్రీనివాసులు, పెద్దయ్యనాయుడు లక్ష్యాలు, థీమ్స్‌పై వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్పీ వెంకటేష్, ఆర్పీలు నాగరాజు, వీరేషప్ప, రాజ్‌కుమార్, ఎల్లకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలంపూర్ చౌరస్తాలో..

అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో ఉండవెల్లి, మానవపాడు మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఆసక్తికరంగా బోధన చేయాలని కోర్సు డైరెక్టర్లు శివప్రసాద్, రామకృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్‌లు హేమలత, అనితబాయి, ఆర్పీలు రాణి, శాలం, విజయభాస్కర్‌రెడ్డి, గజరాజు, సత్యనారయణమూర్తి, మక్బుల్, కుమార్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదేళ్లు బీఆర్‌ఎస్ కాలయాపన


వెంకటాపూర్‌లో లబ్ధిదారుకు ప్రొసిడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో కాలం వెల్లదీసిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ పేదలకు గూడు కల్పిస్తుందన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. ప్రజాపాలనలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి మొదటి విడతగా 3,500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. రానున్న నాలుగేళ్ల కాలంలో సుమారు 14 వేల ఇందిరమ్మ ఇళ్లు కేవలం మహబూబ్‌నగర్ నియోజకవర్గానికే వస్తాయని తెలిపారు. దశలవారీగా అర్హులందరికీ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లను అవమానం చేస్తూ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, గృహ నిర్మాణశాఖ పీడీ వైద్యం భాస్కర్, ఎంపీడీఓ కరుణశ్రీ, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, వెంకట్రాములు, మాధవరెడ్డి, హన్మంతునాయక్, ప్రసాద్, గోపాల్, గోవింద్‌యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, పోతన్‌పల్లి మోహన్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల తరలింపులో కొరవడిన స్పష్టత

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై ఉన్న మహనీయుల విగ్రహాల తరలింపుపై శుక్రవారం అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో స్పష్టత కొరవడింది. తహసీల్దార్ నర్సింగ్‌రావు నేతృత్వంలో నిర్వహించిన ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో జాతీయ రహదారుల శాఖ డీఈ సుమిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. విగ్రహాలు తరలిస్తేనే రోడ్డు పనులు ముందుకు సాగుతాయని అధికారులు వివరించారు. అయితే ఎప్పటిలాగే విగ్రహాలు అక్కడే ఉంచాలని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయ రహదారుల చట్టం అందుకు ఒప్పుకోదని డీఈ వివరించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. విగ్రహాలను ఎప్పటిలాగే ప్రతిష్ఠించేందుకు ఒప్పుకుంటేనే తరలించేందుకు అంగీకరిస్తామని ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. దీంతో సమావేశాన్ని మరోమారు నిర్వహిద్దామని అధికారులు ప్రకటించి వెళ్లిపోయారు. సమావేశానికి నాయకులు కోడ్గల్ యాదయ్య, యంబీ బాలకృష్ణ, తెలుగు సత్తయ్య, కృష్ణలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


పెద్దతాండ్రపాడులో ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

రాజోళి: మండలంలోని పెద్దతాండ్రపాడు గ్రామంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, గణపతి పూజ హోమం, వ్రతాలు చేశారు. రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. లింగమయ్య, వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠించి రామాయణ విశేషాలు, వాల్మీకి జీవిత చరిత్రను తెలియజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాజోళి: మండల పరిధిలోని చిన్నధన్వాడ గ్రామంలోని హనుమాన్ ఆలయాన్ని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శశికుమార్, సంజీవరెడ్డి, భీమన్న, కేశవ్ తదిదరులు పాల్గొన్నారు.


పెద్దతాండ్రపాడులో ప్రతిష్ఠించిన వాల్మీకి మహర్షి విగ్రహం


చిన్నధన్వాడలో ఆలయ ప్రారంభోత్సవంలో బీజేపీ నాయకులు